క్లుప్తంగా

చిలుకూరు ఎస్‌ఐ సురేష్‌రెడ్డికి రివార్డు



ఎస్పీ నరసింహ చేతుల మీదుగా రివార్డు అందుకుంటున్న ఎస్‌ఐ సురేష్‌రెడ్డి

చిలుకూరు : విధులు సమర్థవంతంగా నిర్వర్తిస్తూ కేసులను త్వరితగతిన దర్యాప్తు చేసి పరిష్కరిస్తున్నందుకు శనివారం చిలుకూరు ఎస్‌ఐ సురేష్‌రెడ్డికి సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ నరసింహ చేతుల మీదుగా రివార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐను చిలుకూరు మండల మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

సౌండ్‌సిస్టమ్ బహూకరణ



పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేస్తున్న పోటు అశోక్ దంపతులు

మునగాల : మండలంలోని కొక్కిరేణిలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శనివారం గ్రామానికి చెందిన పోటు అశోక్ –ప్రశాంతి దంపతులు రూ.15వేల విలువగల సౌండ్ సిస్టమ్ బహూకరించారు. ఈ సందర్భంగా అశోక్ దంపతులకు ప్రధానోపాధ్యాయురాలు టి.అన్నపూర్ణ కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల చైర్మన్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు అడిదెల వెంకటరెడ్డి, స్రవంతి, నాగలక్ష్మి, గ్రామపెద్దలు నిడిగొండ శంభయ్య, హుస్సేన్, శ్రీరాములు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

హుజూర్‌నగర్ : పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్‌ఐ మోహన్‌బాబు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.అశోక్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం పోలీస్, మున్సిపల్ సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్, క్వార్టర్స్ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. మాధవరాయిని గూడెం స్టేజ్ వద్ద రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పోలీస్ సిబ్బంది, పురపాలక సంఘ జవాన్లు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన

కోదాడరూరల్ : రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సిరి ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి గోపయ్య అన్నారు. శనివారం మండలంలోని తొగర్రాయి, గణపవరం, కాపుగల్లు, ఎర్రవరం, గుడిబండలో రైతు చైతన్య యాత్రలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి

మేళ్లచెరువు : ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేసి తమతో పాటు కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మొగులూరి గోపి సూచించారు. శనివారం మండలంలోని యర్రగట్టుతండా, మంగళికుంటతండా, కందిబండ, మేళ్లచెరువు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై చేపట్టిన రైతు చైతన్య యాత్రలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో మహిళలు కీలక పాత్ర పోషించాలి



శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మహిళలు

గరిడేపల్లి : ప్రస్తుత రాజకీయాలలో మహిళలు కీలక పాత్ర పోషించాలని మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు చామకూరి రజిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతనంగా ఎన్నికైన ఆయా గ్రామాల మహిళా కమిటీ అధ్యక్షురాలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, పైడిమర్రి రంగనాథ్, ఆయా గ్రామాల మహిళా కమిటీ అధ్యక్షురాలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాసకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి మాసకల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యావచనము, మహాన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలు, స్వామి విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణ తంతును నిర్వహించారు. ఈఓ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయ శర్మ, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో బతుకమ్మ వేడుక

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. పాఠశాలల ఆవరణలో ఉంచి బతుకమ్మ ఆడారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – సాక్షినెట్‌వర్క్



కోదాడ : బాలుర ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కోదాడరూరల్ : బాలాజీనగర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో..



నడిగూడెం : రామాపురం ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



గరిడేపల్లి : సర్వారం ప్రాథమికోన్నత పాఠశాలలో..



చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో..



హుజూర్‌నగర్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు



మోతె : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో..



మఠంపల్లి : మాంట్‌ఫోర్డు ఉన్నత పాఠశాలలో..



మునగాల : ఆకుపాముల శివారులోని మాంటిస్సోరి ప్రైమ్ పాఠశాలలో..



నడిగూడెంలోని శ్రీ సాయి పబ్లిక్ స్కూల్‌లో..



నేరేడుచర్ల : అంజలి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో..



కోదాడ : ఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో..

బాలుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం

కోదాడరూరల్ : మండల పరిధిలోని గణపవరం గ్రామానికి చెందిన కుక్కడపు నాగేశ్వరరావు కుమారుడు మనోహర్(12) ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామ శివారులో వరదకాల్వ తూములో పడి మృతి చెందాడు. విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె బాలుడి కుటుంబసభ్యులకు ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించారు. ఆ చెక్కును శనివారం బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కగాను ఒక్క కుమారుడు అకాల మరణం చెందడం బాధాకరమని అన్నారు. ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ వాజీద్ అలీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఇర్ల సీతరాంరెడ్డి, ఇర్ల నారపరెడ్డి, కాసాని సత్యం, ఇర్ల లక్ష్మారెడ్డి, బండి చిన్నకోటయ్య, సత్యం ఉన్నారు.



బాలుడి తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

న్యాయవాదుల పరిరక్షణ చట్టం తేవాలి

మునగాల : న్యాయవాదులపై ప్రతివాది దాడులను అరికట్టేందుకు పార్లమెంటులో న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకురావాలని మండల కేంద్రానికి చెందిన న్యాయవాది మిర్యాల మంగయ్యగౌడ్ కోరారు. ఈమేరకు శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఈ మెయిల్ ద్వారా లేఖ పంపారు.

మీటర్ రీడర్ల ముందస్తు అరెస్టు

చిలుకూరు : హైదరాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే మీటర్ రీడర్స్ యూనియన్ సమావేశానికి వెళ్లకుండా శనివారం స్థానిక పోలీసులు మండలంలోని కరెంట్ మీటర్ రీడర్లను ముందుస్తుగా అరెస్టు చేశారు. వ్యక్తిగత పూచీకతపై విడుదల చేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి ఎండి ఉమర్

కోదాడ : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎండి ఉమర్ కోరారు. శనివారం కోదాడలోని కేఆర్ఆర్ జూనియర్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు, ఫోక్సో చట్టం, లీగల్ సర్వీస్ యాక్ట్ గురించి వివరించారు. ఈ సందర్భంగా న్యాయ సాధికారతపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రవణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చిత్తలూరి సత్యనారాయణ, న్యాయవాదులు ఎడ్లపల్లి వెంకటేశ్వర్లు, రామిశెట్టి కామకృష్ణ, గట్ల నరసింహారావు, హేమలత, దొడ్డ శ్రీధర్, అధ్యాపకులు వేముల వెంకటేశ్వర్లు, పిచ్చిరెడ్డి, సామాజిక కార్యకర్త మాళోతు సైదానాయక్, లీగల్ సర్వీస్‌సెల్ సభ్యులు మౌనిక, శైలజ, సైదమ్మ, మజహర్, యోసోబు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న న్యాయమూర్తి ఉమర్

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

హుజూర్‌నగర్ : ఐదు నెలలుగా జీతాలు రాక అప్పులతో అల్లాడుతున్నామని పలువురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అన్నారు. సూర్యాపేటలో ఆత్మహత్యకు పాల్పడిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి సంఘీభావంగా శనివారం పట్టణంలోని ఏరియా హాస్పిటల్ ముందు స్థానిక వైద్య, రెవిన్యూ, మున్సిపల్ శాఖల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల జీతం చెల్లించాలని కోరారు. వైద్య, రెవెన్యూ మున్సిపల్ శాఖల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

విద్యార్థుల అభిమానమే నిజమైన గౌరవం

కోదాడ : విద్యార్థుల అభిమానమే ఉపాధ్యాయులకు లభించే నిజమైన గౌరవమని మండల విద్యాధికారి సలీం షరీఫ్ అన్నారు. పట్టణ పరిధిలోని బాలాజీనగర్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్న ఉపాధ్యాయులు రాపర్తి రామనర్సయ్య, సిరంగి రంగారావు వీడ్కోలు సమావేశం శనివారం పాఠశాల ఆవరణలో జరిగింది. వారిని ఎంఈఓ సత్కరించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఏపీసీ చైర్మన్ చైతన్య, ఉపాధ్యాయులు డి.వెంకటేశ్వర్లు, భాగ్యమ్మ, రజని, స్వర్ణకుమారి, సత్తారు, శ్రీనివాసరావు, విజయ్‌బాబు, సైదులు, ఖాజామియా, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సైదానాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.



రామనర్సయ్య దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ సలీం షరీఫ్

పండుగ వేళ.. పరేషాన్ వద్దు

- ఊరు వెళ్తే విలువైన వస్తువులను బ్యాంకుల్లో భద్రపరుచుకోండి
- బస్సుల్లో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండండి
- అమ్మవారి నవరాత్రి వేడుకల నిర్వాహకులు అనుమతి తీసుకోవాలి
- కోదాడ పట్టణ సీఐ శివశంకర్



కె.శివశంకర్, కోదాడ పట్టణ సీఐ

కోదాడ : దసరా, బతుకమ్మ పండుగలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, పండుగ వేళ దూరప్రాంతాలకు వెళ్లే వారు ఇంట్లో విలువైన వస్తువులు పెట్టి పరేషాన్ కాకుండా బ్యాంకుల్లో భద్రపరుచుకోవడం లేదా వెంట తీసుకెళ్లడం చేయాలని.. దుర్గామాత నవరాత్రోత్సవాల నిర్వాహకులు మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలని కోదాడ సీఐ కె.శివశంకర్ సూచించారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

ప్రశ్న : దసరా సెలవుల్లో దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

జవాబు : సెలవుల్లో పిల్లలతో కలిసి దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇంట్లో విలువైన వస్తువులను, ముఖ్యంగా బంగారు ఆభరణాలు, నగదును ఉంచవద్దు. వాటిని బ్యాంకుల్లో భద్రపరుచుకోవాలి. వీలుకాని వారు వెంట తీసుకెళ్లాలి. పండుగల వేళ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువ ఉంటుంది. హ్యాండ్ బ్యాగ్‌లో విలువైన వస్తువును తీసుకెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి.

ప్రశ్న : ఇంటికి తాళం వేసి వెళ్లేవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు : సెలవుల్లో ఇంటికి తాళం వేసి ఎక్కువ రోజులు ఊర్లకు వెళ్లేవారు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వాలి. గస్తీ పోలీసులు తరచూ అలాంటి ఇళ్లను పరిశీలిస్తారు. ఇంటికి సీసీ కెమెరాలున్న వారు వాటిని ఆన్‌లోనే ఉంచి వెళ్లాలి. ఆఫ్ చేయవద్దు.

ప్రశ్న : బతుకమ్మ వేదికల వద్ద ఎలాంటి భద్రతా ఏర్పాట్లు చేశారు ?

జవాబు : బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించే ప్రదేశంలో ప్రత్యేకంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గస్తీ ఏర్పాటు చేస్తాం. మహిళలు ఎలాంటి భయం లేకుండా ఉత్సవాల్లో పాల్గొనవచ్చు. పాత నేరస్తులపై, ఉత్సవాల వద్ద ఇబ్బంది కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. బతుకమ్మ ఉత్సవాల ప్రదేశంలో మహిళలకు చిన్న ఇబ్బంది కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : అమ్మవారి నవరాత్రి వేడుకల నిర్వాహకులకు పోలీసుశాఖ ఇచ్చే సూచనలు ఏమిటి ?

జవాబు: కోదాడపట్టణంలో భక్తులు నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవడానికి పోలీస్‌శాఖ అన్ని విధాలుగా సహకరిస్తుంది. మండప నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. విద్యుత్ ఏర్పాట్లపై తగిన జాగ్రత్తలు పాటించాలి. నిత్యం పోలీసులు మండపాలను సందర్శిస్తారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు. నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలి.

ప్రశ్న : మండపాల వద్ద డీజేలు పెట్టుకోవచ్చా ?

జవాబు : మండపాల వద్ద గాని బతుకమ్మ వేదికల వద్ద గాని డీజేలకు అనుమతి లేదు. నిర్వాహకులు మైక్‌లు ఏర్పాటు చేసుకోవచ్చు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే నిర్వాహకులతో పాటు డీజే యజమానులపై కేసులు నమోదు చేస్తాం.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘచాలక్ అంకతి అప్పయ్య, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్‌గౌడ్ అన్నారు. ప్రధాని మోదీ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ రవి, బీజేపీ రాష్ట్ర నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, ఉమామహేశ్వరరావు, జె.శ్రీనివాస్, డి.ఎల్లయ్య, ఎం.నాగేశ్వరరావు, జె.జనార్దన్, సీహెచ్.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కె.నితిన్, రిటైర్డ్ ఉద్యోగులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

చిలుకూరు : మండలంలోని ఆచార్యులగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు జనార్దన్ మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు, ఐక్య వేదిక సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోతె : మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న రావిపహాడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బి.నాగరాజును శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పరమేష్, ఉపాధ్యాయులు పాపిరెడ్డి, నర్సింహారెడ్డి, పేరెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



మోతె : ఉపాధ్యాయుడు నాగరాజును సన్మానిస్తున్న టీచర్స్, విద్యార్థులు



చిలుకూరు : సన్మానిస్తున్న ఐక్య వేదిక సభ్యులు

అంగన్‌వాడీలో పోషణ మాసం

చిలుకూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని ఐసీడీఎస్ హుజూర్‌నగర్ సెక్టార్ సీడీపీఓ వెంకటలక్ష్మి అన్నారు. శనివారం చిలుకూరులోని అంగన్‌వాడీ కేంద్రం- 4లో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అపార్ ఐడీపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ శ్రీలిఖిత, సూపర్‌వైజర్ సునిత, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, టీచర్ సిరికొండ కవిత, ఐసీడీఎస్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయాల ముట్టడి

- పెన్షన్లు పెంచాలని కార్యదర్శులకు వినతి

కోదాడరూరల్ : ప్రభుత్వం చేయూత పింఛన్ల పెంపుపై ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ అన్నారు. పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట చేయూత పింఛన్‌దారులతో కలిసి ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు, పూర్తి అంగవైకల్యం ఉన్న వారికి రూ.15వేల పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చి నేటికి అమలు చేయకుండా మోసం చేస్తోందని విమర్శించారు. అనంతరం కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు కర్ల విజయరావు, ఏపూరి సత్యరాజు, బచ్చలకూరి వెంకన్న, దుడ్డెల గోపి, శ్రావణ్, కల్యాణ్, ప్రసాద్, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఉన్నారు.

మునగాల మండలంలో..

మునగాల : మండలంలోని రేపాల గ్రామపంచాయతీ కార్యాలయాన్ని వీహెచ్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పేరెల్లి బాబు ఆధ్వర్యంలో ముట్టడించి పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు మేరుగు బుజ్జిరాజు, లక్ష్మయ్య, వెంకన్న, తుమ్మ సత్యమ్మ, పానుగోటి రమణ, సావిత్రమ్మ, బెజవాడ కృష్ణయ్య, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

కలకోవలో..

మండలంలోని కలకోవలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజు ఆధ్వర్యంలో వికలాంగులు, చేయూతపింఛన్‌దారుల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. చేయూత పింఛన్‌దారుల సంఘం నాయకులు ఉప్పరి పిచ్చయ్య, పాతకొట్ల సందీప్, కందిబండ వీరబాబు, బెల్లంకొండ భద్రమ్మ, వెంకటయ్య, గోపయ్య పాల్గొన్నారు.



కోదాడ : వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్, వికలాంగుల సంఘం నాయకులు

బరాఖత్‌గూడెంలో..

మండలంలోని బరాఖత్‌గూడెంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట వికలాంగులు, వృద్ధులు, వితంతువుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీఓ నరేష్‌కు వినతిపత్రం ఇచ్చారు.

హుజూర్‌నగర్ : చేయూత పెన్షన్లు పెంచాలని శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేశారు. పెన్షన్‌దారులు, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌దిన్నలో..

నేరేడుచర్ల : పింఛన్‌దారులకు ఇచ్చిన మాటకు కట్టుబడి లేకపోవడాన్ని నిరసిస్తూ శనివారం నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామ పంచాయతీని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ముట్టడించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యడవల్లి అరుణ్‌కుమార్, వికలాంగులు, ఎమ్మార్పీఎస్ నాయకులు గజగంటి రాము, యడవల్లి బజారు, చిలక సైదులు, రాములు, సైదులు ఉన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : చేయూత పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ శనివారం చిలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్‌కు అందజేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్, మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరిబాబు, నాయకులు సిద్దెల పిచ్చయ్య, బచ్చమ్మ, పాల్గొన్నారు.



మఠంపల్లి : అల్లీపురంలో కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న పింఛన్‌దారులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు

గరిడేపల్లిలో..

గరిడేపల్లి : గరిడేపల్లి పంచాయతీ కార్యదర్శికి ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, సీపీహెచ్‌పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో పింఛన్లు పెంచాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవి, వీహెచ్‌పీఎస్ మండల కార్యదర్శి చందాల సైదులు, ఎంజేఎఫ్ మండల అధ్యక్షుడు బరిగల విజయ్, శేఖర్, రవి, గాంధీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మోతె మండలంలో..

మోతె : పెన్షన్లు పెంచాలని శనివారం మండల వ్యాప్తంగా పింఛన్‌దారులు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయాలను ముట్టడించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బైరపంగు విజయ్, వీహెచ్‌పీఎస్ నాయకులు వెంకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

అల్లీపురంలో..

మఠంపల్లి : పింఛన్లు పెంచాలని శనివారం మండలంలోని అల్లీపురంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పింఛన్‌దారులు ధర్నా నిర్వహించారు. కార్యదర్శి నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు గణేష్, ఆదినారాయణ, ప్రభు పాల్గొన్నారు.